● పెరటాసి.. భక్తసిరి



అలిపిరి పాదాల మండపం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి పుట్టిన మాసం ..పెరటాసి.. ఆ నెలలో ఆ భక్తవత్సలుడు పుట్టిన రోజు శనివారం. ఇది భక్తులకు పరమ పవిత్రం.. ఆ దేవదేవుని జన్మనక్షత్రం వచ్చే ఈ మాసంలో తొలి శనివారం ప్రారంభమైన రోజును పురస్కరించుకుని పులకించిన భక్త జనం.. వెరసి కిక్కిరిసిన అలిపిరి పాదాల మండపం. భక్తుల పూజలు.. హరినామస్మరణలు..కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తులతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



కొబ్బరికాయలు కొడుతున్న భక్త జనం



మోకాళ్లపై నడిచి వెళుతున్న భక్తులు



మెట్లకు పసుపు రాస్తున్న మహిళ



తిరునామం పెడుతున్న మహిళ



పాదాల మండపం వద్ద కిక్కిరిసిన భక్తులు



కాలినడక వెళుతున్న భక్తులు

తిరుపతి ఆర్డీఓ పోస్ట్‌కు భలే డిమాండ్

- పోటీలో పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు
- ఒకప్పటి అర్బన్ తహసీల్దార్లు..

తిరుపతి అర్బన్: రాజకీయ కక్షతో కూటమి సర్కార్ తిరుపతి ఆర్డీఓపై శుక్రవారం రాత్రి సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న తిరుపతి ఆర్డీఓ స్థానాన్ని దక్కించుకోవడానికి శనివారం నుంచి భలే డిమాండ్ నెలకొంది. ప్రధానంగా కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న అధికారులు ఈ పోస్టును కైవసం చేసుకోవడానికి తీవ్రమైన లాబియింగ్ చేస్తున్నట్లు చర్చసాగుతోంది. ఆ ఇద్దరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సీఎం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు కావడంతో వారికే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు గతంలో తిరుపతి అర్బన్, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, చంద్రగిరి తహసీల్దార్లుగా పనిచేసి ప్రస్తుతం ఇరిగేషన్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా హోదాలో ఉన్న ఆ అధికారి అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆయన తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. సామాజిక వర్గం ఓకే..అయితే ముడుపుల విషయంలో మాత్రం తగ్గేదేలేదని ప్రజాప్రతినిధులు స్పష్టం చేయడంతో వేగవంతంగా నగదు సమకూర్చుకునే పనిలో పడ్డారని అంతా అంటున్నారు. అయితే ఈ ముగ్గురులో ఏ అధికారి ముందుగా రూ.2 కోట్లు ఇస్తే వారికే పోస్ట్ దక్కుతుందని బాహాటంగానే అంతా మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో వారిలో ఇద్దరు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారని అంతా అంటున్నారు. మరో అధికారి ఏకంగా చినబాబు సిఫార్సుతో తిరుపతి ఆర్డీఓ కావాలని భావిస్తున్నారు. అవకాశం ఎవరికి దక్కుతుందో సోమవారం వరకు వేచి చూడాల్సి ఉందేనని అంటున్నారు. కాగా శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి ఇన్‌చార్జిగా నియమితులయ్యారు.

భద్రత ముఖ్యం..
భక్తులకు రక్షణే లక్ష్యం

శ్రీవారి బ్రహ్మోత్సవం.. విశ్వవ్యాప్త సంబరం.. భక్తులకు పరమానందం.. అందుకే ఆయన ఉత్సవాలకు కొండంత భక్త జనం తరలివస్తోంది. వారిని తిరుమలకు తరలించి.. అక్కడి నుంచి తిరుపతికి తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్ ప్రజారవాణా సంస్థ వందశాతం కండిషన్ ఉన్న బస్సులనే నడుపుతోంది. భక్తుల భద్రత..వారి ప్రాణరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో బ్రహ్మోత్సవాలకు నడపనున్న ఆర్టీసీ బస్సులను ఆరు దశల్లో తనిఖీ చేస్తోంది. వందశాతం కండిషనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

- బ్రహ్మోత్సవాల బస్సులకు ఆరు దశల్లో పరీక్షలు
- నాల్గు దశల్లో తనిఖీలు పూర్తి
- నేటి నుంచి ఐదో దశగా తనిఖీలు



అలిపిరి క్యాంప్ ఆఫీసును తనిఖీ చేస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వంద శాతం కండిషన్ ఉండే సర్వీసులనే నడపాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ లక్ష్యం. ఈ క్రమంలో బ్రహ్మోత్సవాలకు ఎంపిక చేసిన సర్వీసులను ఆరు దశలుగా తనిఖీలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు తొలిదశ తనిఖీలు డిపోలోనే మెకానికి సిబ్బంది, రెండో దశ తనిఖీలు పక్క డిపోలోని మెకానిక్స్, మూడో దశ తనిఖీలు ఓఈఎంఎస్‌తో చేయించారు. నాలుగో దశ తనిఖీలు పొరుగు జిల్లా ఆర్టీసీ మెకానిక్‌లు తనిఖీ చేశారు. ఆదివారం నుంచి అలిపిరి వద్ద తనిఖీలు చేయడానికి క్యాంప్‌ను ఏర్పాటు చేశారు.

నేటి నుంచి ఐదో దశ తనిఖీలు

ఐదో దశ తనిఖీలను అలిపిరిలోని క్యాంప్ ఆఫీస్‌లో ఆదివారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు చేయనున్నారు.ఆ మేరకు శనివారం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి తనిఖీల క్యాంప్ ఆఫీస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా నిబంధనల మేరకు తనిఖీల్లో కచ్చితమైన రిపోర్ట్‌ను ఇవ్వాలని ఆదేశించారు. కండిషన్ వందశాతం బాగుండే బస్సులను మాత్రమే బ్రహ్మోత్సవాలకు ఎంపిక చేయాల్సి ఉందని చెప్పారు. 99 శాతం కండిషన్ బాగున్నా పక్కన పెట్టాలని స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు. జిల్లాలోని 11 డిపోల నుంచి బ్రహ్మోత్సవాలకు ఎంపిక చేసిన 341 సర్వీసులను నిశితంగా తనిఖీలు చేయాలని స్పష్టం చేశారు. కండిషన్ సక్రమంగా లేకుంటే వాటి స్థానంలో మరో సర్వీసును ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈడీతోపాటు తిరుపతి ఆర్టీసీ మెకానిక్ ఇంజినీర్ నరసింహులు ఉన్నారు.

గంజాయి కేసులో
ఇద్దరికి రిమాండ్

తిరుపతి లీగల్ : అక్రమంగా గంజాయిని తరలిస్తున్న కేసులో ఇద్దరికీ 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ శనివారం ఆదేశాలు జారీ చేశారు. అన్నమయ్య జిల్లా, మదనపల్లె మండలం, చిన్న తిప్పసముద్రం సమీపంలోని నల్లగుంటపల్లెకు చెందిన డి. విష్ణువర్ధన్, మదనపల్లె మండలం, చిన్న తిప్పసముద్రం, గంగాపురం వీధికి చెందిన కె మహేష్ రేణిగుంట రైల్వేస్టేషన్ కార్ పార్కింగ్ వద్ద 10 కిలోల గంజాయిని తరలిస్తుండగా రేణిగుంట పోలీసులు వారిద్దరిని అరెస్టు చేశారు. బెంగళూరుకు చెందిన రమేష్ అనే వ్యక్తి గంజాయిని బెంగళూరుకు తీసుకురావలని కోరడంతో గంజాయిని తరలించినట్టు ఇద్దరు పోలీసుల ఎదుట నేరం అంగీకరించారు. దీంతో రేణిగుంట పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారు. మూడో నిందితుడు రమేష్‌ను అరెస్ట్ చేయాల్సి ఉంది.

క్లుప్తంగా

దేవరకొండపై ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం దేవర కొండపై కొలువైన శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెరిటాసి నెల ఆరంభ శనివారం కావడంతో స్వామి వారికి అభిషేకం, అర్చన జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు కనులపండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మకర్తలు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

28 నుంచి కీలపట్లలో పవిత్రోత్సవాలు

తిరుపతి(అలిపిరి): కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామివారి ఆలయంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు శనివారం టీటీడీ అధికారులు తెలిపారు. 27న సాయంత్రం పుణ్యాహవచనం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

ఎస్‌జీఎస్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి సిటీ : జిల్లా యూత్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన జానపద నృత్య పోటీల్లో ఎస్‌జీఎస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఫోక్ సాంగ్ సింగింగ్ గ్రూప్‌లో రవితేజ, జయంత్, డ్యాన్స్ సోలో విభాగంలో రమ్య ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కొండలరావు, చంద్రయ్య, సులోచనారాణి, పరమేశ్వర, మాదన్న, ఉదయ్ పాల్గొన్నారు.

తిరుమలలో కార్డన్ సెర్చ్


వివరాలు ఆరా తీస్తున్న పోలీసులు

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమలలో ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. బాలాజీ నగర్‌లో ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులు లేని 32 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమానాస్పదంగా ఉన్న 15 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని బైండోవర్ కేసులు నమోదు చేశారు.

నేడు శిల్పారామంలో ఫ్యాషన్ షో

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుపతి శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంప్రదాయ వస్త్రాదరణపై మెష్ ఫ్యాషన్ షో నిర్వహించనున్నట్లు శిల్పారామం ఏఓ ఖాదర్‌వలీ, విన్నర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనర్ డైరెక్టర్ వెంకటేష్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా ఈ షోను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేందర్ రెడ్డి హాజరు కానున్నట్లు వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చంద్రగిరి : తొండవాడ సమీపంలో ఈ నెల 16వ తేదీన జరిగిన ప్రమాదంలో గాయపడి తిరుపతి రుయాలో చికిత్సపొందుతున్న చంద్రశేఖర్‌రెడ్డి(43) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నెల్లుట్లవారిపల్లెలో 'ఇది మంచి ప్రభుత్వం'

భాకరాపేట : మండలంలోని నెల్లుట్లవారిపల్లెలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభంకానున్న సభకు ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరవుతారని వెల్లడించారు.

న్యాయవాదుల వితరణ


వస్తువులు అందిస్తున్న మార్టిన్

తిరుపతి లీగల్ : తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సేకరించిన ఆహారం, రూ.2లక్షల నగదు, ఇతర వస్తువులను శనివారం విజయవాడ వరద బాధితులకు అందజేసినట్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జోసఫ్ మార్టిన్ తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి శివరామ ప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్. రాజేంద్రప్రసాద్ ,మల్లేశ్వరరావు, సి అజయ్ కుమార్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

హామీలన్నీ హుష్‌కాకి!

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆరణి శ్రీనివాసులు ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించారు. కందువాల మార్చినంత సులువుగానే మాయమాటలు చెప్పేశారు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తామని ఊదరగొట్టేశారు. తిరుపతి– తిరుమల రూపురేఖలు మార్చేస్తానని ప్రజలను నమ్మించారు. ఓట్లు రాబట్టుకుని గద్దెనెక్కాక ఇచ్చిన హామీలన్నీ హుష్ కాకి అనేశారు. వంద రోజులు గడుస్తున్నా మీనమేషాలు లెక్కిస్తున్నారు నవ్విపోదురు గాక.. నాకేంటి అనుకుంటూ కాలయాపన చేస్తున్నారు.

- ఎన్నికల సమయంలో గెలుపే లక్ష్యంగా మాయమాటలు
- ఓట్ల కోసం ఎడాపెడా 'ఆరణి' హామీలు
- అధికారంలోకి వచ్చి 100 రోజులు గడిచినా తీరని సమస్యలు
- నిరాశే మిగిలిందంటున్న తిరుపతి వాసులు


ఈద్గా మైదానం సమస్య పరిష్కరిస్తామని హామీ ఇస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు (ఫైల్)

తిరుపతి(అలిపిరి) : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తీరుపై తిరుపతి నియోజకవర్గ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీస సమస్యలను సైతం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎన్నికల్లో విజయం కోసం అలవికాని హామీలిచ్చి, ఇప్పుడు ఏమీ ఎరగనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. టీడీఆర్ బాండ్లలో బాధితులకు వెంటనే న్యాయం చేస్తానని.. తిరుమలలో వ్యాపారులకు సరైన గదుల సౌకర్యంతో పాటు తట్టలవారికి న్యాయం చేస్తామని మాట ఇచ్చారు. చివరకు మెట్లపై చిరువ్యాపారాలు వారి పొట్టకొట్టేస్తున్నారు. సుమారు 31 మంది వ్యాపారులు తమ కుటుంబాలను పోషించుకోలేక టీటీడీ పరిపాలన భవనం ఎదుట 28 రోజులుగా నిరసన తెలుపుతున్నా కనీసం పలకరించిన దాఖలాలు లేవు. ఎమ్మెల్యేగా 100 రోజులు పూర్తి చేసుకున్నా..ఇచ్చిన హామీలు గుర్తులేనట్టు వ్యవహరిస్తున్నారు.

హంద్రీ–నీవా నీరు ఏమైంది?

తిరుపతి ప్రజల తాగునీటి వసతికి చర్యలు తీసుకుంటామని ఆరణి గతంలో ఊదరగొట్టారు. బాలాజీ రిజర్వాయర్‌కు హంద్రీ–నీవా నీటిని తీసుకొస్తామని హామీ ఇచ్చినా దానిపై కనీసం మాట్లాడకపోవడం గమనార్హం.

తిరుమలను ప్రక్షాళన చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే నేడు వారి రాజకీయాల ప్రయోజనాల కోసం లడ్డూను అడ్డుపెట్టుకుని పవిత్రతకు భంగం కలిగిస్తున్నారు. అలాగే నిరుపేదలకు స్థలాలు ఇస్తామని.. ఇళ్లు కట్టించే బాధ్యతను సైతం తీసుకుని ఆదుకుంటామని చెప్పినా ఆ దిశగా చర్యలు శూన్యం. ఈద్గా మైదానం సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పట్టించుకోవడం లేదు. చంద్రబాబునాయుడు గత పాలనలో శిలాఫలకాలతో నిలిచిపోయిన క్రికెట్ స్టేడియం, సైన్స్ మ్యూజియం పనులు పునఃప్రారంభిస్తామని చెప్పి ఇప్పుడు ఊసే ఎత్తడం లేదు. దీనిపై ప్రజలు సైతం ఎక్కడికక్కడ నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు.

ఈఎస్ఐ కార్మికులకు పనిభారం


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

తిరుపతి తుడా : ఈఎస్ఐ కార్మికులకు పనిభారం ఎక్కువైందని, వారికి సక్రమంగా వేతనాలు కూడా చెల్లించడంలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మండిపడ్డారు. శనివారం కార్మికుల సమస్యలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఎస్ఐ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 33వేల చదరపు అడుగుల పాత బిల్డింగ్ ఉన్నప్పుడు 30 మంది స్వీపర్లు, 12 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేసేవారన్నారు. ఇప్పుడు 2.15లక్షల చదరపు అడుగుల బిల్డింగ్ అందుబాటులోకి వచ్చిందని, దీంతో 75 నుంచి 80 మంది వర్కర్స్ అవసరముందని తెలిపారు. అయితే గతంలో పని చేసే సిబ్బందితోనే వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ఈ నెల 26వ తేదీన ఈఎస్ఐ ఆస్పత్రిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, ఈఎస్ఐ నాయకులు, నరసింహులు, నాగభూషణం, మణి, శేఖర్, సరస్వతమ్మ, ఇంద్ర, ధనలక్ష్మి, ముని పాల్గొన్నారు.

ఆదర్శనీయులు 'ఏచూరి'


సంతాప సభలో అధికారులు, నేతలు

తిరుపతి సిటీ : సీతారాం ఏచూరి జీవితం ప్రతి విద్యార్థికీ ఆదర్శనీయమని ఎస్ఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు అరుణ్ కుమార్ కొనియాడారు. శనివారం వర్సిటీ సెనేట్ హాల్‌లో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వర్సిటీ అధికారులు, సీపీఎం, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నేతలు ఘనంగా నివాళులర్పించారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సీబీఎస్ఈ పరీక్షలలో దేశంలోనే మొదటి ర్యాంకు, జేఎన్‌టీయూ ఎంఏ ఎకనామిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన మేధావి సీతారాం ఏచూరి అని వివరించారు. వర్సిటీ వీసీ అప్పారావు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై ఏచూరి పోరాటం అనిర్వచనీయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత కందారపు మురళి, రిజిస్ట్రార్ భూపతినాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర, ఎస్ఎఫ్ఐ నేతలు అక్బర్, రవి, మాధవ్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు


జాతీయ రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

పాకాల : పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం ఈమేరకు తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ఆయా చోట్ల సూచిక, హెచ్చరిక బోర్డులు, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు మద్దయ్య ఆచారి, సుబ్బరామిరెడ్డి, ఆర్‌టీఓ శ్రీనివాసులు, నేషనల్ హైవే అథారిటీ సూపర్‌వైజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్థసారథి జయంతి


మాట్లాడుతున్న గోవిందరాజన్

తిరుపతి సిటీ : తిరుపతి వేదిక్ వర్సిటీలో శనివారం రాష్ట్రపతి పురస్కార గ్రహీత, టీటీడీ మాజీ సలహాదారు రొంపిచెర్ల పార్థసారథి భట్టాచార్యుల 129వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఖానసాగమ పండితులు గోవిందరాజన్ మాట్లాడుతూ వైఖానస గ్రంథ సంపత్తి నిలవడానికి ప్రధాన కారకులు పార్థసారథి భట్టాచార్యులు కారణమని కొనియాడారు. తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటకలో పర్యటించి గ్రంథాలను సంకలనం చేసిన మహనీయులని తెలిపారు. కార్యక్రమంలో వీసీ సదాశివమూర్తి, శత్రుఘ్నాచార్యులు, రాఘవాచార్యులు, డీన్ గోలి సుబ్రమణ్యం, రాజేష్‌కుమార్, పీఆర్‌ఓ డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ


ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు


మొక్క నాటుతున్న వీసీ, రిజిస్ట్రార్, విద్యార్థులు

తిరుపతి కల్చరల్ : ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. శనివారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో మెగా ట్రీ ప్లాంటేషన్‌లో భాగంగా నగరంలో అవగాహనా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, బులెట్ రమణ, కార్పొరేటర్ నరసింహాచారి, లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు రామచంద్రన్, చంద్రారెడ్డి, ప్రతాప్ యాదవ్, భక్తవత్సలంరెడ్డి, సోమయ్య, మక్కిన భాస్కర్, బెల్లంకొండ సురేష్, జగన్నాథం, రాజేంద్రప్రసాద్, మేరీ, మోహన సుందరం పాల్గొన్నారు.

సీతమ్మ నగర్‌లో..

తిరుపతి తుడా: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం సీతమ్మ నగర్ మాస్టర్ ప్లాన్ రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల మహిళలతో కలిసి కమిషనర్ మౌర్య మొక్కలు నాటారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు అవగాహనతో చెత్తను కార్మికులకు అందించాలని కోరారు. ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.


బీసీ హాస్టల్ వద్ద మొక్కలు నాటుతున్న అధికారులు

ఎస్వీయూలో..

తిరుపతి సిటీ : ఎస్వీయూలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, విద్యార్థులు, అధ్యాపకులు వర్సిటీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు దామోదరం, హరికృష్ణ, తాండవకృష్ణ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో..

తిరుపతి అర్బన్ : అన్నమయ్య సర్కిల్ సమీపంలోని బీసీ కళాశాల, హాస్టల్ ప్రాంగణంలో శనివారం అమ్మపేరుతో మొక్కలు నాటారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతుల అందించారు. బీసీ సంక్షేమ సంఘం నేత మధుసూదన్ , బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోత్స్న, హెచ్‌డబ్ల్యూఓ రాధారాణి పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా : క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. శనివారం స్విమ్స్ పాథాలజీ విభాగం ఆధ్వర్యంలో కార్సినోమా ఎండోమెంట్రియమ్‌పై 5వ వార్షిక చైర్ ఒరేషన్ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ ఎండోమెట్రియల్ క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు సోకే ప్రమాదముంటుందన్నారు. ఈస్ట్రోజన్ ఎక్స్‌పోజర్, అధిక రక్తపు పోటు, మధుమేహంతో కూడా ఈ క్యాన్సర్ వచ్చే అవకాశముందని వెల్లడించారు. తొలి దశలోనే గుర్తించి వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ రామ్, ప్రొఫెసర్ కేధార్ కే డియోధర్, డాక్టర్ ఉషాకళావత్, డాక్టర్ రుక్మాంగద, డాక్టర్ వనజాక్షమ్మ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నేతలు

తిరుపతి కల్చరల్ : బీఎస్పీ ఆధ్వర్యంలో అక్టోబర్ 9వ తేదీన విజయవాడలో తలపెట్టిన మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. బీఎస్పీ రీజనల్ కో–ఆర్డినేటర్ పి.గురప్ప మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులజన గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. సమావేశంలో బీఎస్పీ నేతలు ప్రభాకర్, సురేంద్రబాబు, వేణుగోపాల్‌రాజు, వెంకటేష్, భాస్కర్ గౌడ్, మహేష్, హనుమంతు, సంపత్, శశికుమార్ పాల్గొన్నారు.

చార్టెడ్ అకౌంటెంట్ కోర్సుపై అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి

తిరుపతి సిటీ : ఎస్వీ ఆర్ట్స్ కళాశాల కామర్స్ విభాగం, ఐసీఏఐ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు చార్టెడ్ అకౌంటెంట్ కోర్సుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు దేశ, విదేశాలలో ఉన్నత స్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. కామర్స్ విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున్, అధ్యాపకులు ఉషా, చార్టెడ్ అకౌంటెంట్లు మన్నెం సింహాద్రి, విక్రమ్ పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణకు చర్యలు


మాట్లాడుతున్న సాయిస్వామి

తిరుపతి కల్చరల్ : దేవాలయాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, అనుభవజ్ఞులనే ట్రస్ట్ బోర్డుల్లో నియమించాలని రాష్ట్రీయ బ్రాహ్మణ ఫ్రంట్ జాతీయ కన్వీనర్ సాయిస్వామి డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేవాలయాల వ్యవస్థ సక్రమ మార్గంలో నడవడం లేదని ఆరోపించారు. జయచంద్ర, రాజేంద్రప్రసాద్, మధు పాల్గొన్నారు.

పవిత్రం..పెరటాసి శనివారం


తుమ్మలగుంటలో పిండి దీపాలు వెలిగిస్తున్న భక్తులు


చంద్రగిరి : నేతి దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పెరటాసి మాసం మొదటి శనివారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద పెద్దసంఖ్యలో మహిళలు నేతి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

తుమ్మలగుంటలో..

తిరుపతి రూరల్: శ్రీమహావిష్ణువు వైకుంఠాన్ని విడిచి భూలోకంలోని శేషాచల కొండలపై శ్రీవేంకటేశ్వరునిగా అవతరించిన మాసం పెరటాసి మాసం. అందుకే పెరటాసి మాసాన్ని పరమ పవిత్రమైనదిగా భావిస్తారు. పెరటాసి మాసం తొలిశనివారం కావడంతో శనివారం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మహిళలు పిండి దీపాలను నైవేద్యంగా స్వామికి సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయించారు.

నేంద్రగుంటలో..

పాకాల : మండలంలోని నేంద్రగుంటలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరువని మొదటి శనివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ మహిళా మండలి వారు విష్ణుసహస్రనామం, గోవింద నామావళి, శ్రీవారి కీర్తనలను పారాయణం చేశారు.

'మంచి ప్రభుత్వం'పై మండిపాటు



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నాని, కలెక్టర్ వెంకటేశ్వర్, మంగళం సచివాలయానికి ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలు

తిరుపతి మంగళం : చంద్రగిరి నియోజకవర్గం మంగళం పంచాయతీలో శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై మహిళలు మండిపడ్డారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ అక్టోబర 1వ తేదీ నుంచి మంచి మద్యం అందిస్తామని ప్రకటించడంతో మహిళలు అవాక్కయ్యారు. మద్యపానం నిషేధిస్తున్నంత ఘనంగా మంచి మద్యం సరఫరా చేస్తామని చెప్పడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొంతు కోసుకునేందుక ఏ కత్తి అయితే ఏంటని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే నాని, కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం జనంలోనే ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. స్థానికులకు మంగళంలోనే టిడ్కో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. వందరోజుల పాలనతో పలు సంక్షేమ పథకాలు అందించినట్లు వెల్లడించారు. దీంతో సభకు హాజరైన వారు నిర్ఘాంతపోయారు. పింఛన్ పెంచడం తప్ప ఇంకేం అమలు చేశారని అంటూ బహిరంగంగానే వ్యాఖ్యానించారు. హామీలన్నీ తుంగలో తొక్కి, మంచి ప్రభుత్వం అని డబ్బా కొట్టుకుంటే సరిపోతుందా అని అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు పంచాయతీలో సమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా తాగునీరు, మురుగుకాలువలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై స్థానికులు పెద్దసంఖ్యలో అర్జీలు సమర్పించారు. ఇది మంచి ప్రభుత్వం అని గొప్పలు చెప్పకుంటూ స్థానికులకు ఇష్టం లేకపోయినా స్టిక్కర్లను అంటించారు. వంద అడుగుల బ్యానర్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వాళ్ల పబ్లిసిటీ కోసం సచివాలయంపై బ్యానర్లు ఏర్పాటు చేయడం పై స్థానికులు మండిపడ్డారు.

నేడు 'ఘంటసాల ది గ్రేట్' బెనిఫిట్ షో


మాట్లాడుతున్న సీహెచ్ రామారావు

తిరుపతి కల్చరల్ : ఘంటసాల జీవిత చరిత్రపై రూపొందించిన ఘంటసాల ది గ్రేట్ చిత్రం బెనిఫిట్ షోను ఆదివారం ఉదయం 8 గంటలకు దేవేంద్ర థియేటర్‌లో ప్రదర్శిస్తున్నట్లు నిర్మాత, దర్శకుడు సీహెచ్ రామారావు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, భావితరాలకు ఘంటసాల గొప్పదనం తెలియాలనే సదుద్దేశంతో ఘంటసాల బయోపిక్ రూపొందించామన్నారు. డిసెంబర్ 4వ తేదీన ఈ సినిమాను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని థియేటర్లలో విడుదల చేయనున్నామని తెలిపారు. తిరుమల, తిరుపతితో ఘంటసాలకు ఉన్న అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ బెనిఫిట్ షో ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో ఆరే కృష్ణ, సంగీత దర్శకుడు కోటా ఆదిశేషు, ఎంఎం రత్నం పాల్గొన్నారు.

ఇష్టారాజ్యం.. గందరగోళం

తిరుపతి అర్బన్ : తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శనివారం గందరగోళంగా మారింది. ఆదివారం సబ్‌రిజిస్ట్రార్లు, సిబ్బందికి బదిలీల కౌన్సెలింగ్ ఉంది. ఇక్కడ పనిచేస్తున్న 90శాతం మందికి పైగా ఈ మేరకు బదిలీ కానున్నారు. ఈ క్రమంలో శనివారం తిరుపతిలో పనిచేయడం తమకు చివరిరోజు అంటూ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. రిజిస్ట్రేషన్లు చేసేందుకు సబ్‌రిజిస్ట్రార్లు, సిబ్బంది మరోవైపు రైటర్లు లాబీయింగ్ చేసుకునే పనిలో పడ్డారు. దీంతో ఎవరు ఉద్యోగులో.. ఎవరు రైటర్లో తెలియక క్రయవిక్రయదారులు ఇబ్బంది పడ్డారు. బదిలీ హడావుడిలో సిబ్బంది నిర్లక్ష్యంగా ప్రవర్తించడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ స్పందించారు. చివరి రోజు పనిచేస్తున్నామని, ఇష్టానుసారం వ్యవహరిస్తే సరికాదన్నారు. సిబ్బంది తీరుపై విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

ఆటోనగర్‌లో 'మంచి ప్రభుత్వం'


ఆటోనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్


గర్భిణులకు కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి(అలిపిరి): ఆటోనగర్‌లో శనివారం సాయంత్రం 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఇంటింటికీ ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వ స్టిక్కర్స్ అంటించారు. కార్యక్రమంలో కమిషనర్ మౌర్య, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డీఈ విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేపకుప్పంలో..

రామచంద్రాపురం: మండలంలోని వేపకుప్పంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గంగజాతర వేడుకల్లో విద్యుఘాతంతో మృతిచెందిన గోపి ఇంటికి వెళ్లి కుటుంబీకులకు రూ.3.5లక్షల చెక్ అందించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే



తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఘనంగా ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో సమాజానికి ఇంజినీరింగ్ నిపుణుల అవశ్యకత ఎంతో ఉందన్నారు. అకడమిక్ విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్స్‌పై విద్యార్థులు దృష్టి సారిస్తే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని వెల్లడించారు. జాతీయ స్థాయిలో 201–300లోపు ర్యాంకును ఎస్వీసీఈ సాధించడం గర్వకారణమని తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్, సెక్రటరీ ప్రదీప్ పాల్గొన్నారు.